క్లుప్తంగా

దెబ్బతిన్న మిర్జాపల్లి రోడ్డు



కోతకు గురైన మిర్జాపల్లి రోడ్డు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రం నుంచి చిన్నశంకరంపేటకు వెళ్లే రహదారి వరదలతో రెండు చోట్ల కోతకు గురైంది. ఇది జరిగి వారం రోజులైనా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదు. నార్సింగి నుంచి మిర్జాపల్లి వెళ్లే మధ్యలో గన్నేవాగు వరద ఉధృతితో రహదారిపై వరదనీరు భారీగా ప్రవహించింది. దీంతో రెండు చోట్ల రోడ్డు కోతకు గురైంది. మరమ్మతులు చేయక పోతే రోడ్డు మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాల పత్రాలు వెంట ఉంచుకోవాలి

ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం తూప్రాన్–నర్సాపూర్ హైవేపై వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాదారులకు జరిమాన విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిస్తున్న వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.

జూకల్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని జూకల్ గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి షరీఫొద్దీన్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా రోగాలు ప్రబలుతున్నాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు కవిత, సూపర్‌వైజర్ వెంకటరమణాబాయి, ఎంపీహెచ్‌ఈఓ యాదయ్య, ఏఎన్‌యం లలిత, సిబ్బంది వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ చేస్తున్న మహిళలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని టీటీడీ జిల్లా ఉపన్యాసకులు రాంరెడ్డి అన్నారు. చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో గల హనుమాన్ ఆలయంలో శుక్రవారం గోపూజ, వరలక్ష్మీపూజ, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో అర్చకుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడికి సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు కోనం విఠల్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

'కొత్తపల్లి' రోడ్డు.. ప్రయాణం నరకం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

- రూ.2.35 కోట్లు మంజూరు..
- పెండింగ్‌లో రూ.85 లక్షల పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



గుంతలు, బురదమయంగా మారిన కొత్తపల్లి బ్రిడ్జి రోడ్డు

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి అనంతుని వాగుపై గల బ్రిడ్జికి, ఇరు పక్కల గల రోడ్డు నరకానికి నకలుగా మారింది.ఆ రోడ్డు వెంట వెళ్లాలంట్టే కడుపులో పేగులు నోట్లోకి వచ్చినట్లు ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. తరచుగా ఆ వంతెన పైనుండి ప్రయాణించే ప్రజాప్రతినిధులకు.. జిల్లా అధికారులకు చీమకుట్టినట్‌లైనా లేదని జనాలు మండిపడుతున్నారు. అనంతుని వాగుకు ఇరు పక్కల దాదాపు 300 మీటర్ల రోడ్డు, అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో నీళ్లతో నిండి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెదక్–బొడ్మట్‌పల్లి రహదారిలో కొత్తపల్లి వద్ద అనంతుని వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. సదరు కాంట్రాక్టర్ ఏళ్ల తరబడి పనులు చేసి ఎట్టకేలకు బ్రిడ్జి అయిందనిపించాడు. కానీ ఇరుపక్కల మట్టి రోడ్డును అలాగే వదిలేశాడు.

బ్రిడ్జి నిర్మించి.. రోడ్డును విస్మరించారు

వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.35 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.1.50 కోట్లు బ్రిడ్జికి, మిగతా డబ్బులు రోడ్డు తదితర నిర్మాణాలకు ఖర్చు చేయాలి. కాగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి, రోడ్డును మాత్రం వదిలేశారు. కాంట్రాక్టర్‌కు కొన్ని డబ్బులు చెల్లించకపోవడంతో, అతను పని ఆపేసినట్లు సమాచారం. ఐదు మండలాలకు చెందిన ప్రజలు మెదక్‌కు వెళ్లాలంటే ఈ దారే శరణ్యం. నిత్యం సుమారు 500 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని రోజులుగా జోరుగా వర్షాలు కురవడంతో మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. 300 మీటర్ల దూరం దాటాలంటే సుమారు 8 నుండి 10 నిమిషాలు పడుతుంది. వెంటనే అధికారులు స్పందించి కొత్త రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

సమాజానికి గురువే మార్గదర్శకుడు



పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



నర్సాపూర్ రూరల్: గురుకుల పాఠశాలలో..

ఎంఈఓ వెంకటేశం

పెద్దశంకరంపేట(మెదక్): సమాజానికి గురువే మార్గదర్శకుడని ఎంఈఓ వెంకటేశం అన్నారు. శుక్రవారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓతో పాటు ఉపాధ్యాయులను పాఠశాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీరప్ప, జైహింద్‌రెడ్డి, సీతారం, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పాఠశాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాదిగారి గంగాధర్, క్రాంతీలాల్, ఉపాధ్యక్షుడు జంగం రాఘవులు, పున్నయ్య, శ్రావణ్, రవివర్మ, సంగమేశ్వర్, వెంకటరాములు తదితరులు ఉన్నారు.

గురుకులంలో ఉపాధ్యాయ దినోత్సవం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సునంద తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం

రామాయంపేట(మెదక్): ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్‌ఐ కృష్ణయ్య, యూత్ క్లబ్ డైరెక్టర్ గావు సురేందర్, సభ్యులు అంగన్‌వాడీ టీచర్లు బైరం సుజాత, బైరం శ్యామల, పద్మను సన్మానించారు. క్లబ్ సభ్యులు కందెన శ్రీనివాస్, ప్రశాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్స్‌డే

తూప్రాన్: పట్టణంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం టీచర్స్ డే ఘనంగా నిర్వహించినట్లు ఆ కేంద్రం టీచర్ ఇందిర తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన త్రిష టీచర్‌గా వ్యవహరించగా ధరిణి ఆయాగా వ్యవహరించింది. ఆట–పాటలతో చిన్నారుల సందడి నెలకొంది. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.

గిరిజన గురుకుల పాఠశాలలో..

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, వైస్ ప్రిన్సిపాల్ బసవరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నర్సాపూర్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీధర్ గుప్తా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం వాకింగ్ చేసే ఉపాధ్యాయులను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



నర్సాపూర్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్టు చైర్మన్ శ్రీధర్‌గుప్తా

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రవీణ్ కుమార్

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రానికి చెందిన నల్లుల ప్రవీణ్ కుమార్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు బుచ్చంద్ర మాదిగ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం పని చేస్తానని తెలిపారు.

గోపాలమిత్ర జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సంగారెడ్డి: జిల్లాలో పనిచేస్తున్న గోపాల మిత్రలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ మేరకు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గంప శివకుమార్, ఉపాధ్యక్షుడిగా డప్పు మాణిక్యం, కార్యదర్శిగా అలిగే శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. గోపాలమిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి ఆశయాలే ఆదర్శం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వేపల్లి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ నీరజ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు లక్ష్మణ్, పాండు, మనోహరరావు, వెంకటేశ్, నాగరాజు, పెంటాగౌడ్, కృష్ణమూర్తి, రామకృష్ణ, విజయసేనారెడ్డి, యాదగిరి, సుమతి, మంజులత, సురేందర్, సిద్దిరాములు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తూముల్లో లీకేజీ

వృథాగా పోతున్న నీరు

తూముల్లో నుంచి చెరువు నీరు వృథాగా పోతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. భారీ వర్షాలకు చండీ గ్రామ పరిధిలోని చామస్ చెరువు నిండి అలుగు పారింది. పది రోజుల నుంచి చెరువు రెండు తూముల్లో నుంచి నీరు లీకై వృథాగా పోతోంది. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని రైతులు వాపోయారు. ఇరిగేషన్ ఏఈ సునీత వివరణ కోరగా.. తూముల లీకేజీకి మరమ్మతులు చేస్తామని చెప్పారు.

– శివ్వంపేట(నర్సాపూర్):



చండీ చామస్ చెరువు తూముల్లో నుంచి నీరు వృథాగా పోతున్న దృశ్యం

సంక్షిప్త వార్తలు

◆ రిటైర్డు ఉద్యోగుల దినోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో రిటైర్డు ఉద్యోగుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సాంబయ్యగారి నర్సింలు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులు సంఘటితంగా ఉండి సమస్యల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు గుజ్జరి వెంకటరమణ, పురుషోత్తం, సుశీల, నారాయణ, అంజయ్య పాల్గొన్నారు.

◆ వేలాడుతున్న తీగలను సరి చేయాలి

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని బీసీ కాలనీ సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు శుక్రవారం కోరారు. కొంత కాలంగా తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారినా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. వేలాడుతున్న తీగల వలన ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేకపోలేవని తెలిపారు. తీగలను సరి చేయాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో నర్సాపూర్, చిలప్‌చెడ్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. పేదలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

◆ 80 ఎంఆర్పీఎస్ ర్యాలీ

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచాలని ఎంఆర్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు రామస్వామి డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 8న జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సాయిబాబా, బాలనర్సింలు, శ్రీను, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ బడా గణేశుడికి పూజలు

పటాన్‌చెరు: ఖైరతాబాద్ విఘ్నేశ్వరుడు భక్తుల సర్వ విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు ప్రసాదించాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని బడా గణేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, సభ్యులు వీణ మాధురి, గంగాధర్, నిశాంత్, మొగల్, సందీప్, రాజు, అజయ్, చిన్న, ఖైరతాబాద్ , ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన బీజేపీ నాయకులు

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జీఎస్టీ సంస్కరణలపై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై సామాన్యుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీని తగ్గిస్తూ కుదించడంతో పేదలు మేలు లబ్ధి చేకూరుతుందన్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత ఉపయోగించే వస్తువులపై పన్ను భారం తగ్గనుంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలకు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.



పాపన్నపేట: మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



రామాయంపేట: ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కార్యకర్తలు



నిజాంపేట: ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గణేష్ గడ్డ జాతరకు ముమ్మర ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్‌గడ్డ దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ మేరకు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్, జగదీశ్వర్ స్వామి, అయ్యప్ప, సతీష్‌లు తెలిపారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో గణనాథుడి అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ ఉత్సవాల్లో చివరి రోజు శనివారం జరగనున్న జాతరకు సంబంధించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, ఆలయ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూ వేలం, రథోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



వివిధ రకాల పుష్పాల అలంకరణలో గణనాథుడు

పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

హత్నూర (సంగారెడ్డి): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని షారుల్లా షహీద్ దర్గాతో పాటు పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు ఖాలెద్ సహాబ్ ఖాద్రీ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హత్నూర మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్, నాయకులు ఇస్మాయిల్, అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.



పూజ నిర్వహిస్తున్న గురువులు

గంగమ్మ ఒడికి గణేశుడు

జిల్లాలో శుక్రవారం పలుచోట్ల గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొల్చారం, పాపన్నపేట, పెద్దశంకరంపేట, నార్సింగి, కౌడపల్లి, మెదక్, చేగుంట మండలం రెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం ఆయా చెరువుల్లో నిమజ్జనం చేశారు.



పెద్దశంకరంపేటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



పాపన్నపేటలో వినాయకుని శోభాయత్ర



నార్సింగి: వల్లూర్‌లో గణనాథుడి నిమజ్జనం చేస్తున్న యువకులు



కొల్చారంలో వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమం



కౌడిపల్లిలో వినాయన నిమజ్జన శోభాయాత్ర



పటాన్‌చెరు టౌన్: పూజల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



చేగుంట: రెడ్డిపల్లి హనుమాన్ యూత్ గణపతి వద్ద పూజల్లో స్థానిక నాయకులు

ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందజేస్తాం



జహీరాబాద్ టౌన్: కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మహేష్, డీటీ జుబేర్, మక్సూద్

జహీరాబాద్ టౌన్: ప్రతి పేదవాడికి కొత్త రేషన్ కార్డు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మక్సూద్ అన్నారు. మండల కేంద్రంలోని మొగుడంపల్లి రైతు వేదికలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ అహ్మద్, ఆర్ఐ సిద్దారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతి పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మెటల్‌కుంట, హద్నూర్, ముంగి, మిర్జాపూర్(ఎన్), టేకూర్, తాట్‌పల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్‌ల చైర్మన్లు సిద్దిలింగయ్య స్వామి, జగనాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, శ్యామెల్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.